31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం,అక్టోబర్ 23 , 2026 పేజీలు : 8

## పేదల పక్షాన నిలిచిన నాయకుడు 'పండుగ సాయన్న'

• కలెక్టర్ చిత్రా మిశ్రా

**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 22 :** నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకొని దోపిడీ



చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

## రెండో విడత దళిత బంధు లబ్ధిదారులకు
## శుభవార్త...నిధులు మంజూరు

• ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 22 :** హుజురాబాద్ నియోజకవర్గంలో ఆయా మండలాల్లో రెండో విడత దళిత బంధు లబ్ధిదారులకు ప్రభుత్వ నిధులు విడుదల చేస్తుందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రకటించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండో విడత దళిత బంధు పథకం కింద పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాల్సి ఉండగా, తన సుదీర్ఘ పోరాటం ఫలితంగా నేడు నిధుల విడుదలకు మంజూరు లభించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, "రెండో విడత దళిత బంధు పథకం కింద ఎవరికైతే డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయో, వారందరూ వెంటనే సంబంధిత మండల తహసీల్దార్, హుజురాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి లను సంప్రదించాలని ఆయన కోరారు. లబ్ధిదారుల సమస్య పరిష్కారమై, వారికి



రావాల్సిన రావాల్సిన లబ్ధి అందుతుంది.. నిధులు వస్తాయి అని సూచించారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి తనను కలవవచ్చని, లబ్ధిదారుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

### ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు
## ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

• యాసంగిలో వరిసాగును ప్రోత్సహించవద్దు
• రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి
• మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్య రాకుండా చూడాలి
• రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 22:** ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలని, యాసంగిలో వరిసాగును ప్రోత్సాహిం చవద్దని, రైతులను ప్రత్యామ్నాయ పం టల వైపు మళ్లించాలని,మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్య రాకుండా చూడాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీలో కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ఖరీఫ్ తక్కువ నష్టంతో ముగిసినా రానున్న ఎనిమిది నెలలు వర్షం లేని పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవా లన్నారు. ప్రస్తుతం ఎస్ఆర్ఎస్పీ, చెరువుల్లో ఉన్న నీటిని తాగునీటి కోసం కాపాడుకోవాలని, ఎస్ఆర్ఎస్పీ నుంచి యాసంగికి నీరు విడుదల చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు. బోరు ఉన్నా వరి వద్దని, తక్కువ నీటితో వచ్చే కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు. మిషన్ భగీ రథ ద్వారా వచ్చే జూన్ వరకు తాగునీటి కొరత రాకుండా చూడాలన్నారు. అనం తరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లా డుతూ జిల్లాలో సాధారణం కంటే 11 శాతం వర్షాభావం ఉందని, 20 మండ లాల్లో అక్టోబర్ లో వర్షం నమోదు కాలే దని తెలిపారు. 4.20 లక్షల ఎకరాల సాగులో 3,107 ఎకరాల్లో నీటి ఒత్తిడి ఉందని, జగిత్యాల రూరల్ లో 37 శా తం, కోడిమ్యాలలో 41 శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలమట్టం సగటున 3.65 మీటర్లకు పడిపోయిందని, గతేడాది కంటే 1.32 మీటర్లు తగ్గిందని, కోడిమ్యాలలో ఏకంగా 10.23 మీటర్ల లోతుకు చేరిందని వివరించారు. ఎస్ఆర్ఎస్పీలో 80.5 టీఎంసీల సామర్థ్యానికి గాను 36.2 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, చెరువుల్లో 61 శాతం నిల్వ ఉందని తెలిపారు. యాసంగిలో కూరగాయల సాగును 263 నుంచి 563 ఎకరాలకు, ఆయిల్ పామ్ ను 152 నుంచి 1019 ఎకరాలకు పెంచే ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ 2 లక్షల ఎకరాల వరి లక్ష్యాన్ని పునఃసమీక్షించాలని, కనీసం 10 ఎకరాల్లో కూడా వరిని ప్రోత్సహించవద్దని-మిగతా 2లో

## విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

• జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
• కథలపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 22 :** విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం కథలాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు,బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు,నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. స్టేషన్ పరిసరాల పరిశు భ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు భద్రతా భావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని -మిగతా 2లో

## ప్రజా వీరుడు పండుగ సాయన్న

• కలెక్టర్ బి. సత్యప్రసాద్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 22 :** నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న ప్రజా వీరుడని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపిన బహుజన వీరుడు ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలవబడే పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆనాడు నిజాంల ధాన్యం కారాగాన్ని కొల్లగొట్టి వాటిని పేదలకు పంచి పెట్టేవాడు అని అన్నారు. ధనవంతుల నుండి, పెట్టు బడుదారుల వ్యవస్థ నుండి భూస్వాముల నుండి, అణగారిన వర్గాలను అణిచివేతకు గురి కాకుండా వారి పై తిరుగుబాటు చేశాడన్నారు. తెలంగాణ ప్రాంత వాసిగా మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టిన పండుగ సాయన్న నిజాం పాలన పై అలుపెరుగని పోరాటం చేశాడని ఆయన చిన్నప్పటి నుండే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, కలెక్టరేట్ ఏఓ కిషన్, సిబ్బంది , బీసీ సంఘాల నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## రోస్టర్ పాయింట్ల విధానంలో మాలలకు న్యాయం జరిగే వరకు పోరాటం

**-మాజీ మంత్రి సుద్దాల దేవయ్య**



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 22 :** రోస్టర్ పాయింట్ల విధానంలో మాలలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి సుద్దాల దేవయ్య అన్నారు. బుధవారం రాత్రి జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో మాలల కోఆర్డినేషన్ ఆధ్వర్యంలో రోస్టర్ సవరణ సాధన కమిటీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.ప్రస్తుత రోస్టర్ పాయింట్ల విధానం వల్ల ఉద్యోగ నియామకాల్లో మాలలకు అన్యాయం జరుగుతోందని సుద్దాల దేవయ్య ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో రోస్టర్ పాయింట్ల విధానం అమల్లోకి వచ్చిన తర్వాత భర్తీ అయిన ఉద్యోగాల్లో మాలలకు దాదాపుగా ఒక్క ఉద్యోగం కూడా దక్కలేదని పేర్కొన్నారు. మాలలకు న్యాయం జరిగేలా రోస్టర్ పాయింట్ల విధానాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వచ్చే నెలలో కోరుట్ల పట్టణంలో మెట్పల్లి పాత తాలూకా స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

## విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**మొదటి పేజీ తరువాయి...**సూచించారు.రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా,అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు.ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు ,విద్యాసంస్థలు,వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు .రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు.ఎస్పీ వెంట ఎస్.ఐ రవి కిరణ్, సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టి పరారైన కారు

**అక్కడికక్కడే వ్యక్తి మృతి**

**చురకలు విలేఖరి,జగిత్యాల, అక్టోబర్, 22 :** నిజామాబాద్ నుంచి తిరిగి వస్తున్న కారు, రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.ఈ ఘటన సాయంత్రం 7గంటల సమయంలో రిలయన్స్ పెట్రోల్ పంప్ సమీపంలో చోటుచేసుకుంది.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..పోచమ్మవాడకు చెందిన కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు నిజామాబాద్ నుంచి తిరిగి వస్తుండగా, రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టింది. అనంతరం కారు ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది.ఈ ఘటనను గమనించిన ఇస్లాంపుర, అమీనాబాద్‌కు చెందిన యువకులు కారును వెంబడించి మంచినీళ్ల బావి సమీపంలో అడ్డుకున్నారు.కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని,మద్యం సేవించినట్లు కనిపించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని కారు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.మృతుడి వివరాలు, ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారణ చేపట్టి తదుపరి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసిన కమిషనర్

**-మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్**



**చురకలు విలేఖరి,హుజురాబాద్, అక్టోబర్, 22 :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఎవరు చేయనటువంటి పనులు వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంక్షేమం కొరకు ఉద్యోగుల మేలు కొరకు ఎన్నో పనులు చేపట్టిన ఘనత తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు కే పేరు దక్కిందని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్ నుండి సీనియర్ అసిస్టెంట్ గా సీనియర్ అసిస్టెంట్ నుండి ఎ సి టి ఓ గా ఎ సి టి ఓ నుండి డి సి టి ఓ నుండి సిటిఓ నుండి డిప్యూటీ కమిషనర్ నుండి జాయింట్ కమిషనర్ నుండి అడిషనల్ కమిషనర్ ప్రమోషన్లు ఇచ్చిన ఘనత ఎం రఘునందన్ రావు కు పేరు దక్కిందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలియజేశారు ఎం రఘునందన్ రావు పదవి బాధ్యతలు చేపట్టిన అప్పటినుండి ఇప్పటివరకు కొన్ని సంవత్సరాలు నుండి పెండింగ్లో ఉన్న అన్ని రకాల సమస్యల ను పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానా కు రెవిన్యూ తేవటంలో కూడా ఎంతో కృషి చేస్తున్న అధికారి ఎం రఘునందన్ రావు అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు భారతదేశంలోని జీఎస్టీ లో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానం రావడానికి ఎంతో కృషి చేసిన కమిషనర్ ఎం రఘునందన్ రావు అని ఆయన అన్నారు జాయింట్ కమిషనర్ల సమావేశాలు జరుపుతూ అనేక రకాల సలహాలు ఇస్తూ ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసులు చేయిస్తూ ప్రభుత్వ ఖజానాకు వ్యాపారుస్తులు జమ చేసినట్టు ఎంతో కృషి చేస్తున్న అధికారి ఎం రఘునందన్ రావు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద వ్యాపారాల కు సంబంధించిన అనేక ఇంట్రెస్ట్ నుండి కూడా ప్రభుత్వ ఖజానాకు ప్రతి నెల చెల్లించవలసిన అనేక రకాల బకాయిలను ప్రభుత్వ ఖజానాలో జమ అయినట్టు ఎంతో కృషి చేస్తున్న తెలంగాణ వాణిజ్య పన్నుల కమిషనర్ ఎం రఘునందన్ రావుకి కేంద్ర ప్రభుత్వంలో మరియు తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంచి పేరు గుర్తింపు వచ్చింది అని మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న అన్ని క్యాటగిరి లకు సంబంధించిన ఉద్యోగులు ప్రతి ఒక్కరు ఎంతో సంతోషముతో ఉన్నారు దానికి కారణం మా కమిషనర్ ఎం రఘునందన్ రావు పేరు దక్కిందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ మరియు ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు కె కలవడానికి ఎవరైనా ఉద్యోగులు వారి యొక్క చాంబర్లో వెళ్లినట్టు అయితే ఏంటిది అని పలకరిస్తూ చిరునవ్వుతో మీ సమస్య ఏంటిది అని చెప్పండి అని చెప్పి మీ సమస్య పరిష్కారం కొరకు నా వంతు నేను కృషి చేస్తానని హామీ ఇస్తారు ఆ హామీని కూడా తొందర్లో పని చేసి పెడతారు అలాంటి అధికారి ఎం రఘునందన్ రావు అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలియజేశారు 10 సంవత్సరాలు జరగని పనులు ఎం రఘునందన్ రావు గారు పదవి బాధ్యతలు చేపట్టిన అప్పటినుండి ఇప్పటివరకు అనేక ప్రమోషన్లు ఇచ్చిన ఘనత కమిషనర్ ఎం రఘునందన్ రావుకి పేరు దక్కిందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు కమిషనర్ కార్యాలయంలో పరిధిలో పనిచేస్తున్న ఈ మధ్యకాలంలో సుప్రీంటెలందరి కి కూడా బదిలీలు చేసి ఎటువంటి సమస్యలు కూడా మీ వద్ద పెండింగ్ ఉండకూడదని వారికి కూడా చెప్పడం జరిగింది అంత మంచి కమిషనర్ ఎం రఘునందన్ రావు అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలియజేశారు.వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ఏదైనా ఉన్నట్టయితే ఆ సమస్యల పరిష్కారం కొరకు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు గారి అపార్ట్మెంట్ కోరిన వెంటనే సమయం కేటాయించి ఉద్యోగ సంఘ నాయకులు చెప్పిన విషయాలను వారిచ్చిన రెప్రెసెంటేషన్లోనూ వెంటనే పరిష్కరిస్తున్న ఘనత వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ నా యొక్క సర్వీస్ లో ఇంత మంచి కమిషనర్ నేనెప్పుడూ కూడా చూడలేదు అలాంటి వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎం రఘునందన్ రావు మా డిపార్ట్మెంట్ రావటమే చాలా అదృష్టం ఇలాంటి అధికారిని జీవితంలో ఎప్పుడు కూడా మర్చిపోలేము ఎందుకంటే 10 సంవత్సరాలుగా సుదీర్ఘంగా పోరాటం చేసిన ఏ సి టి ఓ నాకు కూడా గజిటెడ్ హోదా జీవో ఇచ్చిన ఘనత కూడా వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కే పేరు దక్కిందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు.

## ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**

సూచించారు. రాయికల్ చెరువు 270 ఎకరాల్లో ఉందని, 16 వేల మందికి తాగునీటి ఆధారమని, అందులో వరి వేస్తే తాగునీటికి ఇబ్బంది వస్తుందని హెచ్చరించారు. చెరువుల్లో నీటిని నిల్వ ఉంచితేనే చుట్టుపక్కల బోర్లు బతుకుతాయని, వీబీజీ రాంజీ ద్వారా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ నారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో గండాన్ని అధిగమిద్దాం

**- తక్కువ నీటితో కూరగాయల సాగును ప్రోత్సహిద్దాం!**
**-నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి**
**- జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (పెద్దపల్లి), అక్టోబర్ 22 :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, తక్కువ నీటితో సాగయ్యే కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని పెద్దపల్లి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ రైతులకు సూచించారు.రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా బెండ, అలసంద, గోరుచిక్కుడు, వంగ, మునగ, చిలగ డదుంపతో పాటు అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగల సాహూ వంటి టమాటా రకాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలని సూచించారు. కూరగాయల సాగులో నేల నుంచి నీటి ఆవిరి నష్టాన్ని తగ్గించేందుకు మల్చింగ్ షీట్లను తప్పనిసరిగా వినియో గించాలని, తద్వారా నేలలో తేమను ఎక్కువకాలం నిలుపుకోవడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను కూడా నియంత్రించవచ్చని వివరించారు.ప్రస్తుత నీటి కొరత పరిస్థితుల్లో పారుదల పద్ధతిలో నీటిని వృథా చేయకుండా, బిందు సేద్యం (డ్రిప్), తుంపర సేద్యం (స్ప్రింక్లర్) పద్ధతులను మాత్రమే అనుసరించాలని రైతులకు సూచించారు. నీటి లభ్యతను బట్టి పంట విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని, నేలలో తేమను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మేరకే నీటిని అందించాలని తెలిపారు. “అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ, సరైన పంటలను ఎంచుకుంటే వర్షాభావ పరిస్థితుల్లోనూ రైతులు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది” అని శ్యాంప్రసాద్ పేర్కొన్నారు.

## నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**





**చురకలు ప్రతినిధి,జగిత్యాల,అక్టోబర్ 22 :** సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన 111 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52,04,450 విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం పంపిణీ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**చురకలు విలేకరి,జగిత్యాల,అక్టోబర్ 22 :** జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ ఎస్టీ యువతీ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ,ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు.ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ మైదాన ప్రాంతాలు, ట్రైకార్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నారు.18 నుంచి 35ఏళ్లలోపు జగిత్యాల జిల్లా ఎస్టీ యువత అర్హులు. ఉచితశిక్షణతో పాటు కోర్సు మెటీరియల్స్,శిక్షణ పూర్తయ్యాక ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.అప్పారెల్,అగ్రికల్చర్,బ్యూటీ అండ్ వెల్ నెస్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ,ఏఎఫ్ సీ ఇండియా,ఎన్ఐ-ఎంఎస్ఎంఈ రంగాల్లో జాతీయ సంస్థల ద్వారా శిక్షణ ఇస్తారు.ఆసక్తి గల అభ్యర్థులు ఎస్టీ కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హత పత్రాలు,ఆధార్ కార్డు,3 ఫోటోలతో జిల్లా కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ



**చురకలు విలేకరి,బీర్‌పూర్,అక్టోబర్ 22 :** సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామంలో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంపెయిన్ నిర్వహించారు. టీజీబీ బ్యాంకు మేనేజర్ వెంకట్ రెడ్డి, ఫైనాన్షియల్ లిటరసీ అధికారుల ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు.గ్రామానికి చెందిన సిలివేరి లక్ష్మీనారాయణ (40) నెల క్రితం పాముకాటుతో, తమ్మ నర్సయ్య (48) రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వారికి ప్రధానమంత్రి సురక్ష బీమా ఉండడంతో బ్యాంకు మేనేజర్ చొరవతో రూ.2 లక్షల బీమా మొత్తాన్ని మంజూరు చేశారు. నామినీలు సిలివేరి నీరజ, తమ్మ లలితలకు గ్రామ పంచాయతీలో సర్పంచ్ బాస మహేష్ చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ అధికారులు విజయ్ కుమార్, సౌజన్య, కార్యదర్శి, బేర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్‌కు ఘన నివాళి

**-హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీక.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్,22 :** భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అష్ఫాకుల్లా ఖాన్‌కు ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్ర వెలుమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు ఫోన్లో తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన ఆయన జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశభక్తి,త్యాగనిరతి, మతసామరస్యానికి అష్ఫాకుల్లా ఖాన్ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు.

**1900 అక్టోబర్ 22న జననం**

అష్ఫాకుల్లా ఖాన్ 1900 అక్టోబర్ 22న ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ లో షఫీకుర్ రెహమాన్, మజ్హరున్నీసా దంపతులకు జన్మించారు. చిన్నతనం నుంచే దేశభక్తి భావాలు కలిగిన ఆయన బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. విప్లవకారుడు రామ్ ప్రసాద్ బిస్మిల్‌తో ఆయనకు ఉన్న స్నేహం భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిందని జువ్వాడి నర్సింగరావు తెలిపారు.

**కాకోరి కేసులో ఉరిశిక్ష**

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్న అష్ఫాకుల్లా ఖాన్‌కు 1925 కాకోరి రైలు చర్యకు సంబంధించిన కేసులో మరణశిక్ష విధించబడిందని తెలిపారు. 1927డిసెంబర్ 19న ఫైజాబాద్ జైలు లో ఆయనను ఉరితీశారని గుర్తుచేశారు .దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.

**మతాలకు అతీతంగా భారతీయులుగా ఉండాలి**

అష్ఫాకుల్లా ఖాన్ జీవితం స్వాతంత్ర్య పోరాటానికే పరిమితం కాలేదని,హిందూ-ముస్లిం ఐక్యతకు కూడా ఆయన గొప్ప సందేశాన్ని అందించారని నర్సింగరావు పేర్కొన్నారు.మతాల పేరుతో ప్రజలు పరస్పరం కలహించుకోకుండా భారతీయులుగా ఐక్యంగా ఉండాలని, దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆశించారని తెలిపారు. ఆయన స్నేహం, త్యాగం నేటికీ మతసామరస్యానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.

**యువతకు స్ఫూర్తి అష్ఫాకుల్లా ఖాన్ త్యాగం**

దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని సైతం ధైర్యంగా ఎదుర్కొన్న అష్ఫాకుల్లా ఖాన్ త్యాగం భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతుందని జువ్వాడి నర్సింగరావు అన్నారు.స్వేచ్ఛ, సమానత్వం, జాతీయ ఐక్యత కోసం ఆయన చేసిన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అష్ఫాకుల్లా ఖాన్ జయంతి సందర్భంగా ఆయన త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశించిన మతసామరస్యం, జాతీయ ఐక్యత, సోదరభావంతో కూడిన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ రావు పిలుపునిచ్చారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు వరం

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, అక్టోబర్ 22 :** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల భవిష్యత్తుకు వరమని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన పాఠశాలను తాటిపల్లి-మోరపల్లి శివారులో 25 ఎకరాల్లో నిర్మించనున్నారు.ఈ నెల 25న మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం నిర్మాణ స్థలాన్ని, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, 25 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో నిర్మించే ఈ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు వరంగా నిలుస్తుందన్నారు. శంకుస్థాపన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ షాదాబ్ హాకీం, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలో

# పండుగ సాయన్న జయంతి




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 22 :** జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెత్తందార్ల అన్యాయాలకు ఎదురొడ్డి పేదలకు అండగా నిలిచిన ధైర్యశాలి సాయన్న అని, ఆత్మగౌరవం, సమానత్వం కోసం సాగిన పోరాటానికి ప్రతీక అని కొనియాడారు. ఆయన జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఆర్ఐ వేణు, సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దసరా గొడవ పంచాయితీ

# సమావేశానికి పోలీస్ బ్రేక్



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 22 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో శమీపూజ,దుర్గమాత నిమజ్జన విషయంలో జరిగిన గొడవ విషయంలో గ్రామపంచాయితీ ఆధ్వర్యం లో గురువారం పంచాయితీ నిర్వహిస్తున్నట్లు ప్రకటనలు వెలువడడంతో వెల్గటూర్ పోలీసులు స్పందించి శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ వద్దఎలాంటి సమావేశం నిర్వహించరా దని నోటీసు జారిచేయడంతో పంచాయితీ సమావేశం వాయిదా పడింది. దసరా రోజు దుర్గ భవాని నిమజ్జనం, శమీ పూజ నిర్వాహణలో సమయపాలన విషయంలో గ్రామస్థుల్లో వాగ్వివాదం జరిగింది.దీని విషయంలో పంచాయతీ సమావేశం జరుపడానికి ప్రకటన విలువడడంతో గొడవలు జరిగే పరిస్థితి ఉండడంతో ఈ చర్యలు తీసుకొన్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

## కొమరం భీమ్ జయంతి



**చురకలు ప్రతినిధి,ఇబ్రహీంపట్నం అక్టోబర్ 22 :** కొమరం భీమ్ జయంతి వేడుకలను జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని యామాపుర్ గ్రామంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన విగ్రహంకు పులమాలాలు వేసి నివాళులర్పించారు.అనతరం ఈసందర్భంగా పోరాటాలను స్మరించుకున్నారు.ఆదివాసీల హక్కుల సాధన కోసం, జల్-జంగల్-జమీన్ నినాదంతో కొమరం భీమ్ సాగించిన పోరాటం చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు.ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనక నాగేష్, ఉప సర్పంచ్ దామెర లావణ్య శ్రీనివాస్, వీడీసీ సభ్యులు మోర్తాటి గంగారెడ్డి, నాకెపాడు యూత్ సభ్యులు, సంఘ సభ్యులు వేంద్రాల మహేందర్, గంప గంగారాం, బిచ్చల వెంకటేష్,మాజీ సర్పంచ్ వేలాల దశరథ్ రెడ్డి, జైడి దేవా రెడ్డి, వార్డు సభ్యులు చిట్యాల వినోద్, బందెల రాజేందర్ తదితరులు పాల్గొని కొమరం భీమ్‌కు నివాళులర్పించారు.

## టిఆర్ఎస్‌లో చేరికలు




**చురకలు ప్రతినిధి,జగిత్యాల,అక్టోబర్ 22 :** జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు యువకులు టిఆర్ఎస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పునుగోటి పవన్ రావు నేతృత్వంలో జగిత్యాల క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ పునుగోటి పవన్ రావు టిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.జగిత్యాల నియోజకవర్గానికి ఎంపీ హోదాలో కవిత సేవలు వెలకట్టలేవని,వారి మార్గదర్శకంలో పార్టీకి సేవలందిస్తామని ఈ సందర్భంగా కార్యకర్తలు అన్నారు.అనంతరం రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో,పునుగోటి పవన్ రావు సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ విధానాలకు ఆకర్షితులై,ఎంపీగా కవిత గారు చేసిన సేవలను గుర్తించిన ప్రజలు టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి జగిత్యాల నియోజకవర్గం ఇన్చార్జ్ పవన్‌రావు మాట్లాడుతూ ఎంపీ హోదాలో కవిత జగిత్యాల ప్రజలకు ఎన్నో సేవలు అందించారని,జగిత్యాల అభివృద్ధికై నిత్యం పాటు పడ్డారని,జగిత్యాల అభివృద్ధి ప్రదాత కవితని ఈ సందర్భంగా పవన్ రావు అన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ, రాయికల్ మండలాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మెట్పల్లి వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 22 :** కోరుట్ల నియోజకవర్గం లోని మెట్పల్లి పట్టణ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి.అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.డి. హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా జి. దయానంద్ కోశాధికారిగా సిహెచ్. రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎం.డి. హుస్సేన్ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ...

**-తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు**
**-పల్లె పదాలతో ఆడి పాడిన ఆడపడుచులు**
**-అంబరాన్నంటిన సంబరాలు**
**-11 రోజుల పాటు పూలనే దేవతగా కొలిచి గౌరమ్మకు పూజలు**
**-శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగిన నిమజ్జనాలు**





**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (22) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఇబ్రహీంపట్నం మండలంలో వైభవంగా జరిగాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించిన మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. పల్లె పదాలు, జానపద గీతాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటగా, వేడుకల అనంతరం గౌరమ్మను గంగమ్మ ఒడికి చేర్చి నిమజ్జనం చేశారు. కొన్ని గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు కొనసాగాయి.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, వర్షకొండ, డబ్బ, అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, ఎర్రాపూర్, కోజన్ కొత్తూర్, కేశాపూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని దేవాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో చేరి బతుకమ్మలను ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.

**తీరొక్క పూలతో బతుకమ్మల పేర్పు...**

ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి, వాటిని వరుసలుగా అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేయడం పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తంగేడు, గునుగు తదితర పూలతో రంగురంగులుగా బతుకమ్మలను అలంకరించి, మధ్యలో పసుపుతో గౌరమ్మను ప్రతిష్ఠించి భక్తితో పూజించారు. నూతన వస్త్రాలు, సంప్రదాయ ఆభరణాలు ధరించిన మహిళలు తమ బతుకమ్మలను తీసుకుని వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి, ఎంతో ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకున్నారు.

**పల్లె పదాలతో ఆటపాటలు..**

బతుకమ్మల చుట్టూ వలయాకారంగా తిరుగుతూ మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడారు. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలను ఆలపిస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు. చిన్నారులు సైతం మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**11 రోజుల పాటు గౌరమ్మకు పూజలు..**

ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసంలో అమావాస్యతో ప్రారంభమయ్యే బతుకమ్మ పండుగను మహిళలు తొమ్మిది రోజుల పాటు వివిధ పేర్లతో జరుపుకుని, సద్దుల బతుకమ్మతో వేడుకలను ముగిస్తారు. ఈ రోజుల్లో ప్రతిరోజూ బతుకమ్మకు ప్రత్యేకంగా పూజలు చేసి, సంప్రదాయ నైవేద్యాలను సమర్పిస్తారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా వివిధ రకాల పిండివంటలను తయారు చేసి గౌరమ్మకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటూ పసుపు గౌరమ్మలను అందజేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సంప్రదాయం మహిళల మధ్య ఆత్మీయతను, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తోంది.

**గంగమ్మ ఒడికి చేరిన బతుకమ్మలు..**

ఆటపాటలు, పూజలతో సందడిగా సాగిన వేడుకల అనంతరం మహిళలు బతుకమ్మలను సమీపంలోని గోదావరి నది, చెరువులు, కుంటల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గౌరమ్మకు వీడ్కోలు పలుకుతూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.కొన్ని గ్రామాల్లో రాత్రి వేళ ప్రారంభమైన నిమజ్జనాలు ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు కొనసాగాయి. దీంతో పండుగ ముగిసే వరకు గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.

**సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ...**

బతుకమ్మ పండుగకు నెల రోజుల ముందునుంచే మహిళలు పూల సేకరణ,వస్త్రాలు,ఆభరణాల కొనుగోళ్లు, అలంకరణలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు.ప్రకృతిని పూజించడం, పూలకు ప్రాధాన్యత ఇవ్వడం, మహిళల ఐక్యతను చాటడం ఈ పండుగ ప్రత్యేకత.తెలంగాణ సంస్కృతిని భావితరాలకు పరిచయం చేసే బతుకమ్మ వేడుకలను మండలంలోని గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి సంప్రదాయాలను కొనసాగించారు.

**పోలీసుల ముందస్తు చర్యలు..**

బతుకమ్మ నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇబ్రహీంపట్నం పోలీసులు మండలంలో ముందస్తు చర్యలు చేపట్టారు.గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ పరిస్థితులను పర్యవేక్షించారు.మహిళలు, చిన్నారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.







# బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకోం

**-కేసులు కొట్టివేసే వరకు న్యాయపోరాటం చేస్తాం**
**-మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**



**చురకలు విలేఖరి చిగురుమామిడి అక్టోబర్ 22 :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరుతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం సిగ్గుచేటని, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కేసులతో వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే శ్రీ వొడితల సతీష్ కుమార్ గారు విమర్శించారు.కోహెడ మండలం ధర్మసాగర్‌పల్లి గ్రామంలో కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఆయన పరామర్శించి, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా సతీష్ కుమార్ గారు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష కార్యకర్తలను కేసులతో భయపెట్టాలని చూడటం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. కేసులు పెట్టినంత మాత్రాన బీఆర్ఎస్ కార్యకర్తలు వెనక్కి తగ్గరని, ఉద్యమాల నుంచి పుట్టిన బీఆర్ఎస్ పార్టీని బెదిరింపులతో అణచివేయడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు.అధికారం శాశ్వతం కాదు.. ప్రజాసేవే అసలైన బాధ్యత. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ఉపయోగించకూడదని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెడుతోందని విమర్శించారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకులు,కార్యకర్తలను రాజకీయ కక్షతో వేధించే విధంగా వ్యవహరించలేదని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు.

**అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తాం**

"బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోం. ప్రతి కార్యకర్త వెనుక పార్టీ అండగా ఉంటుంది. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తాం. అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తాం. సంబంధిత కేసులు చట్టబద్ధంగా కొట్టివేయబడే వరకు మా పోరాటం కొనసాగుతుంది. కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని సతీష్‌కుమార్ స్పష్టం చేశారు.

**బంధువుల ద్వారా పాలన సాగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

మండలాల వారీగా బంధువులను ముందుంచి, వారి ద్వారానే ప్రభుత్వ పనులు చేయించే విధానం రాజుల కాలం నాటి పాలనను తలపిస్తోందని సతీష్ కుమార్ గారు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి, నేరుగా ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అధికారుల ను,ప్రజలను పక్కనపెట్టి బంధువుల ద్వారా పాలన సాగించాలను కోవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు వచ్చి ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వారు ప్రజలకు వారధిగా ఉండాలి తప్ప, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించకూడదని వొడితల సతీష్ కుమార్ గారు హితవు పలికారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాల్సిన నాయకులు ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించడం తగదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో అంతిమ అధికారం ప్రజలదేనని, అధికార పార్టీ నాయకుల అహంకారానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరిధిలో అన్ని విధాలా పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.

# కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ హఫీజుద్దీన్ సతీమణి అఫ్జలున్నిసా మృతి

**-సంతాపం తెలిపిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ, సుడా మాజీ చైర్మన్, సిపి గౌష్ ఆలం**
**-హాఫిజ్ యూసుఫ్‌ను ఫోన్ లో పరామర్శించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ**



**కరీంనగర్, అక్టోబర్ 22 :** కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ దివంగత సయ్యద్ హఫీజుద్దీన్ అలియాస్ హాఫిజ్ భాయి సతీమణి (శా సాహబ్ మొహాల్లె) అఫ్జలున్నిసా బేగం (90) అనారోగ్యానికి గురై బుధవారం రాత్రి మరణించారు. ఖాద్రీ ఖాందాన్ లో మంచికి మారుపేరుగా అఫ్జలున్నిసా నిలిచారని, మంచి కుటుంబ నేపథ్యంతో ముందడుగు వేశారని అఫ్జలున్నిసా సేవలను, కుటుంబ సభ్యులు, ఆమె కుటుంబ శ్రేయోభిలాషులు గుర్తు చేసుకున్నారు. అఫ్జలున్నిసా మృతి పట్ల ఆమె కుమారుడు ఎంఐఎం సీనియర్ నేత, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్ ను, ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపి బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు, బిఆర్ఎస్ నేత చలిమేడ లక్ష్మీ నర్సింహరావు, గాంధీ పేపర్ క్రాఫ్ట్ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మాజిద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్ మేరాజ్, ముబీన్, మీర్ జుల్ఫీఖార్ అలీ, ఎంఐఎం జిల్లా ఇంచార్జి యాసర్ అర్ఫాత్, ఎమ్మెల్సీ రియజుల్ హసన్ ఎఫెయిండి, కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, సుడా మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసిఉల్లాహ్ ఖాన్, మహమ్మద్ సలీం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ లు ఇంతియాజ్ ఇస్ హాఖ్, సయ్యద్ అక్బర్ హుస్సేన్ తదితరులు సంతాపం తెలిపారు. ఎంఐఎం కరీంనగర్ జిల్లా ఉమ్మడి అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జమియతుల్ ఉలేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్, హాఫిజ్ షఫీయుద్దీన్ ఏజాస్ ఇమాం అస్లామి మస్జిద్, సదర్ ఖాజి హాఫిజ్ మంఖబత్ శాఖాన్, హాఫిజ్ వసిముద్దీన్, హాఫిజ్ సోహైల్ బిన్ అబ్దుల్లా, లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాజిద్, అహిళే సున్నత్ వల్ జమాత్ మౌలాన ఖయ్యూమ్ జియాయి, మౌలానా అలిమొద్దీన్ నిజామీ, మౌలానా అబుల్ కలాం మిస్బాహి, అబ్దుల్ కరీం జాహిద్, జమియతుల్ హుఫ్ఫాజ్ కార్యదర్శి హాఫిజ్ జియాఉల్లాహ్ ఖాన్, కరిముల్లాహ్ శాసాహబ్ దర్గాహ్ ముతవల్లి మన్సూర్ సులేమాన్ తవక్కలి, జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్, ఖైరోద్దీన్, తబలీగ్ జమాత్ ప్రతినిధులు రహీం మాము, ఆబిద్, జమియత్ అహిలే హదిస్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సమి, నూర్ బాషా జేఏసీ చైర్మన్ అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, బిఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల కార్పొరేటర్లు, అన్ని జమాత్ లకు చెందిన ముస్లిం సోదరులు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ముస్లిం నాయకులు, కరీంనగర్ పురాతన జామా మస్జిద్ లో జుహార్ నమాజ్ అనంతరం నిర్వహించిన నమాజే జనాజాకు వందలాదిమంది హాజరై దుఆ చేశారు. తకియ మొహాళ్ల ఖబ్రస్థాన్ లో అంత్యక్రియలు పూర్తి చేశారు. కుల, మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున హిందూ సోదరులు తరలివచ్చి హాఫీజ్ యూసుఫ్ ను పరామర్శించారు.



## రెజ్లింగ్‌లో బంగారు పతకం సాధించిన విద్యార్థినికి ఘన సన్మానం





**చురకలు ప్రతినిధి మంథని,అక్టోబర్ 22 :** మంథని మండలం బిట్టుపల్లి గ్రామానికి చెందిన బందెల కీర్తి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించినందుకు గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. రామగుండంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కీర్తి, ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన పోటీల్లో అర్హత సాధించి, ఈ నెల 11 నుండి 13 వరకు హైదరాబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. అలాగే అదే గ్రామానికి చెందిన బందెల కౌశిక్ ఐఐటీలో సీటు సాధించడంతో గ్రామస్తులు ఇద్దరినీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయక్ పోడ్ జిల్లా అధ్యక్షుడు కొలకాని సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మేకల సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలం మల్లేష్, గ్రామ ఉప సర్పంచ్ బందెల కిష్టయ్య, వార్డు సభ్యులు కొలకాని భూమయ్య, మెడగొని సంతోష్, అయినాల రాజశేఖర్, కొలకాని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ డైరెక్టర్ చందర్ నాయక్‌కు సన్మానం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 22 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ ఏఎంసి డైరెక్టర్‌గా భూక్య చంధర్ నాయక్ నియామకమైన సందర్భంగా గురువారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పి సన్మానించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియార్టీని గుర్తించి పార్టీకి నిబద్ధతతో పనిచేసిన చందర్ నాయక్‌ను నియామకం చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో నాయకులు గడ్డం జితేందర్ గంట వెంకటేష్ గౌడ్ పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అందె చంద్రయ్య మహబూబ్,మోహన్ నాయక్ జ్యోతి తదితరులు పాల్గొని చందర్ నాయక్‌ను అభినందించారు.

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సీహెచ్ నరసింహారాజు



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 22 :** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సీహెచ్ నరసింహారాజు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం,మాజీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో పాటు పార్టీ సీనియర్ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.?తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ, కరీంనగర్ జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## వీణవంక నూతన ఎంపీడీవోగా ఎల్. వెంకటేశ్వర్ రెడ్డి



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 22 :** వీణవంక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎల్.వెంకటేశ్వర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ విజిలెన్స్‌లో సేవలందించిన ఆయన, ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా వీణవంక మండలానికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మండల సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ పారదర్శకంగా చేరవేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొని నూతన ఎంపీడీవోకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## భైంసా,ముధోల్‌లో ప్రశాంతంగా దుర్గామాత నిమజ్జనాలు



**చురకలు ప్రతినిధి,నిర్మల్,అక్టోబర్, 22 :** నిర్మల్ జిల్లా భైంసా, ముధోల్ పట్టణాల్లో దుర్గామాత నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి. భక్తులు, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ భైంసా పట్టణంలో 300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల భైంసా పట్టణంలో నిమజ్జన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ శోభాయాత్ర మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నిమజ్జన ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ముధోల్ పట్టణంలోనూ పర్యటించి నిమజ్జన ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తును స్వయంగా తనిఖీ చేశారు. భైంసా పట్టణాన్ని నాలుగు సెక్టర్లుగా విభజించి పంజేసా మసీదు, పురాణ బజార్, బ్రాహ్మణ గల్లి, బట్టి గల్లి, కిసాన్ గల్లి, పిపిరి కాలనీ, కుబేర రద్దా, పంజేసా చౌక్ తదితర ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణ, పుషింగ్ పార్టీలు, రూఫ్‌టాప్ బందోబస్తు, బైక్ పెట్రోలింగ్, స్టాటిక్ బందోబస్తు వంటి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన భక్తులు, మండపాల నిర్వాహకులు, ప్రజలకు నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమాల్లో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సర్పంచ్ దంపతులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 22 :** విజయవాడలోని ప్రసిద్ధ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్,రేణుక దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొండ రమేష్ గౌడ్, రేణుక దంపతులతో పాటు వారి కుమారుడు, కుమార్తె కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ప్రార్థించారు. కనకదుర్గమ్మ దర్శనంతో కుటుంబ సభ్యులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ విజయం ఖాయం

**-బిఆర్ఎస్ నేత బండ శ్రీనివాస్**
**-జనగామ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన బండ**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 22 :** వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలను నియమించింది. హుజురాబాద్ కు చెందిన బండ శ్రీనివాస్ ను జనగామ నియోజకవర్గం ఇన్చార్జిగా నియమించారు. ఆయన ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డితో కలిసి జనగామలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రచారం నిర్వహిస్తారు. బండ శ్రీనివాస్ తో పాటు ఆయా నియోజకవర్గాలకు ఇన్చార్జిలను నియమిస్తూ బిఆర్ఎస్ పార్టీ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బండ శ్రీనివాస్ ను స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో పాటు కౌన్సిలర్లు గందే శ్రీనివాస్, వర్ధినేని రవీందర్రావు, తులసి లక్ష్మణ మూర్తి, కొలిపాక శ్రీనివాస్, విడపు రాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, కేసిరెడ్డి లావణ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు పూసల ప్రభావతి రెడ్డి తదితరులు అభినందించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం : బండ**

రాష్ట్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో గ్రాడ్యుయేట్లలో విద్యావంతుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ తరపున జనగామ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన బండ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లయిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. గోదావరిలో నీళ్లు సముద్రంలో వెళ్లి కలుస్తున్నప్పటికీ ఎత్తిపోయడం లేదని మండిపడ్డారు. కావాలని ఆంధ్ర ప్రాంతానికి నీళ్లు ఇస్తూ తెలంగాణను ఎండ బెడుతున్నారని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని విద్యుత్ కోతలు ఉన్నాయని,పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆత్మహత్యలు చేసుకుంటు న్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామా అని ప్రజలు తలలు పట్టుకుంటున్నారని ఆయన అన్నారు. విద్యావంతులు యువత ఎన్నికల్లో గులాబీ పార్టీ బలపరిచిన, కెసిఆర్ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనగామ నియోజకవర్గానికి ఇన్చార్జిగా నియమించిన కేటీఆర్, హరీష్ రావు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# హుజురాబాద్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి

**-బహుజనుల హక్కుల సాధనకు సాయన్న స్ఫూర్తితో పోరాడాలి**
**-ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 22 :** తెలంగాణ రాబిన్‌హుడ్ గా పేరుగాంచిన బహుజన విప్లవ యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి ఉత్సవాలను హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం ముదిరాజ్ సంఘం, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న సేవలను, పోరాట స్ఫూర్తిని నాయకులు స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తన కాలంలో పేదలు,అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలబడి,సంపన్నుల దోపిడీకి వ్యతిరేకం గా పోరాడిన మహా యోధుడిగా పండుగ సాయన్న గుర్తింపు పొందా రని పేర్కొన్నారు. పేదలఆకలి తీర్చేందుకు, బలహీనవర్గాలకు అండగా నిలిచేందుకు ఆయన చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పండుగ సాయన్న వంటి గొప్పపోరాట యోధుడు తమ జాతిలో జన్మించడం తెలంగాణ ముదిరాజు లందరికీ గర్వకారణమని సమ్మయ్య పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ బహుజనుల హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ముదిరాజులను బీసీ-ఏలో చేర్చాలి**

ముదిరాజుల ప్రధాన డిమాండ్ అయిన బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి వర్గీకరణ మార్పు కోసం రానున్న రోజుల్లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతా మని సమ్మయ్య తెలిపారు. ఈ డిమాండ్ సాధనకు తెలంగాణలోని ముదిరాజు లందరూ ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక న్యాయం, సమానత్వం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గుడ్డేల్లుల సమ్మయ్య, పోచయ్య, పిల్లి సమ్మయ్య, గోస్కుల వెంకన్న, గుడ్డేల్లుల సారయ్య, రవీందర్ బాబు, బహుజన నాయకులు వేల్పుల రత్నం, కొలిపాక శ్రీనివాస్, ఉప్పు శ్రీనివాస్, రాం రాజేశ్వర్, తులసి లక్ష్మణమూర్తి, బుర్రి శేఖర్, వేల్పుల ప్రభాకర్, చిలుకమరి శ్రీనివాస్, రఘుచారి, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఒడ్డెర కాలనీలో హైమాస్ లైట్లను ప్రారంభం



**చురకలు విలేకరి,బీర్‌పూర్, అక్టోబర్ 22 :** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో సారంగాపూర్ మండలం రంగంపేట ఒడ్డెర కాలనీలో మంజూరైన హైమాస్ లైట్లను గురువారం ప్రారంభించారు. కాలనీ ప్రజల అవసరాలను గుర్తించి, రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు, ప్రజల భద్రతకు తోడ్పడేలా ఎంపీ నిధులతో హైమాస్ లైట్లను మంజూరు చేయగా, గ్రామ సర్పంచ్ పల్లపు మాధవి బాపురాజు, ఉపసర్పంచ్ చెల్లా లావణ్య మల్లేశంతో కలిసి బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా.బోగ శ్రావణి లైట్లను ప్రారంభించారు. కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఈ సందర్భంగా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండుగుల వంశీ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిటి వెంకటేష్, మత్స్యకార సెల్ జగిత్యాల జిల్లా కన్వీనర్ బద్దెల గంగరాజం, చిరంజీవి, కళ్యాణ్, నవీన్, అరుణ్, నర్సయ్య, గజ్జల నరేశ్, బుచ్చయ్య, బొట్టు నాంపల్లి, ప్రసాద్, సురేష్, లవన్, యశ్వంత్, జశ్వంత్, ఎల్లారెడ్డి, బాల శేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యాలకు అనుగుణంగా అర్హులందరికీ

# బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

**-బ్యాంకర్లకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు**
**-స్వయం ఉపాధికి చేయూతనివ్వాలి**
**-మహిళా సంఘాలకు రుణాలపై అవగాహన కల్పించాలి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 22 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ పథకాల కింద నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులందరికీ బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వ్యవసాయం,విద్య,గృహ నిర్మాణం, స్వయం ఉపాధి తదితర రంగాలకు రుణాల పంపిణీలో వంద శాతం లక్ష్యాలను సాధించాలని బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల పనితీరు,రుణాల మంజూరు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, లక్ష్యాల సాధనపై బ్యాంకుల వారీగా సమీక్ష నిర్వహించారు.వ్యవసాయ, గృహ,విద్యా రుణాలతో పాటు మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ),ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాల అమలు తీరును పరిశీలించారు.నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఇళ్ల నిర్మాణానికి అర్హులైన వారికి రుణాలు అందించి,గృహ నిర్మాణాలకు సహకరించాలని ఆదేశించారు.

**శిక్షణ పొందిన వారికి రుణాలతో చేయూత**

ఆర్ సేథీ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలపై కలెక్టర్ ఆరా తీశారు. వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలకు ఉపయోగపడే నైపుణ్య శిక్షణ అందించాలని సూచించారు. ఇప్పటివరకు 13 విభాగాల్లో 314 మందికి శిక్షణ అందించిన సంస్థ ప్రతినిధులను అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. శిక్షణకే పరిమితం కాకుండా, శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

**మహిళా సంఘాలకు రుణాలపై అవగాహన కల్పించాలి**

మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీపై సమీక్షించిన కలెక్టర్.. మహిళలు తీసుకునే రుణాలను ఆదాయాన్ని పెంచే స్వయం ఉపాధి కార్యక్రమాలకు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో మహిళా సంఘాలకు ప్రభుత్వ రుణ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన వారికి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎల్నినో ప్రభావం నేపథ్యంలో అర్హులైన వారికి రుణాలు అందించడంలో బ్యాంకులు చొరవ చూపాలన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల ప్రయోజనాలను వినియోగదారులకు వివరించి, వాటిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరేలా బ్యాంకర్లు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎల్డీఎం రాజీవ్ కుమార్, ఆర్బీఐ ఎల్డీఓ చేతన్ ఎం. గోఖేల్, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, యూబీఐ బ్యాంకు అధికారి కృష్ణమాచారి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మరోసారి ప్రధాన కార్యదర్శిగా "మాడ"



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 22 :** బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన మాడ వెంకట్ రెడ్డి మరోసారి నియమితులయ్యారు. బిజెపి కరీంనగర్ జిల్లా కమిటీని గురువారం అధిష్టానం ప్రకటించింది. గతంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాడ వెంకట్ రెడ్డిని మరోసారి ప్రధాన కార్యదర్శిగా నియమించారు. వెంకట్ రెడ్డి గత 20 ఏళ్లుగా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్నారు. గతంలో యువజన విభాగం నాయకునిగా పనిచేశాడు. ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ సందర్భంగా మాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో విశ్వాసంతో ప్రధాన కార్యదర్శి పదవిని ఇచ్చిన కేంద్రమంత్రి బండి సంజయ్ కి, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

**కాంగ్రెస్కు ప్రత్యామ్నాయం బిజెపి నే... : మాడ**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని, భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాడ వెంకట్రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశ భద్రత విషయంలో రాజీ పడకుండా మోడీ పని చేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మోడీ కృషి చేశారని తెలిపారు. 1980 లలో కేవలం ఒకే సీటు ఉన్న బిజెపి నేడు దేశమంతా విస్తరించిందని, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని తెలిపారు. రాష్ట్రంలోనూ బిజెపి బలమైన ప్రతిపక్షంగా ఉందన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్ రెండు పార్టీలపై ప్రజలు విసుకు చెందారని, రాష్ట్రాన్ని సరైన పద్ధతిలో కేంద్ర ప్రభుత్వ సాయంతో నడిపించే శక్తి కేవలం బిజెపికి మాత్రమే ఉందన్నారు. రాబోయే కాలంలో మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గం తో పాటు కరీంనగర్ జిల్లాలో పార్టీని గ్రామ గ్రామాన మరింత బలోపేతం చేసి 2028 ఎన్నికలకు సమాయత్తం చేస్తామని స్పష్టం చేశారు. కాగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాడ వెంకట్రెడ్డిని కొత్తగట్టు గ్రామానికి చెందిన పలువురు తో పాటు హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాలకు చెందిన బిజెపి నేతలు అభినందిస్తున్నారు.

# ఆది శ్రీనివాస్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 22 :** విజయదశమి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్ రెడ్డి, గంట వెంకటేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి తదితరులు ఆది శ్రీనివాస్‌ను కలిసి విజయదశమి శు భాకాంక్షలు తెలియజేశారు. దసరా పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, సిరిసంపదలు నింపాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల తో జరుపుకుంటారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తూ పరస్పర ఆప్యాయతలను చాటుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు

# కొమురం భీమ్ జీవితం స్ఫూర్తిదాయకం

**-తెలంగాణ భవన్‌లో కొమురం భీమ్ జయంతి వేడుకలు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట,అక్టోబర్ 22 :** ఆదివాసీల హక్కుల సాధన కోసం 'జల్, జంగల్, జమీన్' నినాదంతో పోరాడిన విప్లవ వీరుడు కొమురం భీమ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట ఆగన్న అన్నారు. కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. నాఫ్స్ చైర్మన్ కొండూరు రవీందర్ రావుతో కలిసి కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఆదివాసీ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం**

ఈ సందర్భంగా తోట ఆగన్న మాట్లాడుతూ కొమురం భీమ్ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. భూమి, అడవి, నీటిపై ఆదివాసీలకు హక్కులు ఉండాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి, తన ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన కొమురం భీమ్ జీవితం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ఆయన త్యాగం, ధైర్యం, పోరాట పటిమ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు. కొమురం భీమ్ ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, వారి అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పలువురు నాయకుల నివాళులు**

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూర బాలు, మొగిలి నాగరాజు, ఎల్లారెడ్డిపేట మండల సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజబింకర్ రాజన్న, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, అమర్ రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొని కొమురం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

# రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం



**చురకలు,విలేఖరి,వెల్గటూర్,అక్టోబర్ 22 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన "రైతు నేస్తం" వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారు లు,కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ అధికారులు,కాటన్ మిల్లు యజమానులు ,ప్రజాప్రతినిధులు ,రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రైతులకు పలు సూచనలు చేశారు. పత్తికొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు,పత్తి నాణ్యతనుబట్టిధరనిర్ణయించినట్లు, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కనుగుణంగా రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు.



# మందుబాబుల ప్రాణాలతో చెలగాటం

**-"పర్మిట్" రూముల్లో..**
**కానరాని పరిశుభ్రత**
**-పట్టించుకోని అధికారులు**
**-చెత్త చెదారంతో కనిపిస్తున్న పర్మిట్ రూములు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 22 :** హుజురాబాద్ సబ్ డివిజన్లోని మద్యం దుకాణాల పర్మిట్ రూపంలో పరిశుభ్రత ఎక్కడ కనిపించడం లేదు.ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం..పర్మిట్ రూముల్లో మాత్రమే మద్యం సేవించాలి. కానీ మందుబాబులు రోడ్లపైనే మద్యం దుకాణాల ముందు మద్యం సేవి స్తున్నారు.పర్మిట్ రూముల్లో అనువైన వాతావరణం ఎక్కడ కనిపించడం లేదు. ఈగలు దోమలతో,కీటకాలతో, అపరిశుభ్రమైన వాతావరణం పర్మిట్ రూముల్లో తాండవిస్తోంది.హైజీన్‌తో నిర్వహించాల్సిన పర్మిట్‌రూములనుయాజమాన్యాలు ఏమాత్రం పట్టించు కోవడం లేదు.ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ కూడా లేదు. దీంతో యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మందు బాబుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాగునీరు టాయిలెట్స్ వంటి కనీస సౌకర్యాలు కూడా ఎక్కడ పర్మిట్ రూముల్లో లేవు.కుళ్లిపోయిన ఆహార పదార్థాలు పర్మిట్ రూముల్లో కనిపిస్తున్నాయి.నిజానికి పర్మిట్ రూముల్లో మద్యం ప్రియులు కూర్చునే సౌకర్యం ఉండొద్దు. నిబంధనల ప్రకారం నిల్చునే మద్యం సేవించాలి. కానీ పలు మద్యం దుకాణాల యజమానులు వీటిని బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా నడుపుతున్నారు. అయినప్పటికీ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. పర్మిట్ రూముల పేరుతో లక్షల రూపాయలు సంపాదిస్తున్న మద్యం దుకాణాల యజమానులు మాత్రం ఇవేవీ పట్టించుకోవడం లేదు.నెల నెల అధికారులకు మామూళ్లు ముట్టజెప్పడంతో వారు కూడా పట్టించుకోవడంలేదని మద్యం దుకాణాల యజమానులకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జనావాసాల్లో పర్మిట్ రూములు ఉండడంతో.. మహిళలు పాఠశాల విద్యార్థులు విద్యార్థినిలు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖ అధికారులు పరిశుభ్రత లేని పర్మిట్ రూములపై కొరడా ఝుళిపించాల్సి ఉంది.

## 'తుపాకీ రాముడు'...

# యూనిఫామ్ వేస్తేనే బువ్వ



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 22 :** ఉదయం లేచాడు అంటే చాలు గ్రామాల్లో ఖాకీ యూనిఫారం వేసుకొని కట్టే తుపాకి వేసుకొని గ్రామాల్లో తిరిగితే కానీ పొట్ట గడవదు. కమాన్ పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన వృత్తి భిక్షాటన చేస్తూ ప్రజలను కడుపుబ్బ నవ్వు నవ్విస్తూ పదో 20 రూపాయలు అడుక్కోవడం తుపాకి రాముని రోజువారి డ్యూటీ. పోలీసు యూనిఫామ్, భుజానికి వేలాడే చెక్క తుపాకీ, చేతిలో లాఠీ, తలపై టోపీ. రోడ్డు పక్కన నిలబడితే నిజమైన కానిస్టేబుల్ లానే కనిపిస్తాడు. కానీ ఆయన పోలీసు కాదు, పేరు రాముడు. అందరూ ముద్దుగా 'తుపాకీ రాముడు' అని పిలుస్తారు.ఈయన రోజూ గ్రామాల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.పాత పోలీసు డ్రెస్ లాంటి బట్టలు వేసుకుని, సొంతంగా తయారు చేసుకున్న చెక్క తుపాకీని భుజాన వేసుకుని ఊరూరా తిరగడం ఆయన దినచర్య.ఊళ్లోకి రాగానే పిల్లలు, పెద్దలు ఆయన్ని చుట్టుముడతారు. ఏందీ రాము, డ్యూటీ అయిపోయిందా? అని సరదాగా పలకరిస్తారు. ఆయన కూడా అదే పోలీసు హావభావాలతో నటిస్తూ, లాఠీని తిప్పుతూ నవ్విస్తాడు. అందరూ ఇచ్చే పది రూపాయలు, కొంత బియ్యంతో ఆ రోజు గడుస్తుంది.నిజానికి ఇది బిచ్చమెత్తుకునే ఒక వినూత్న శైలి. జాలి చూపించి అడుక్కోవడం కంటే, ఒక పాత్రలో ఒదిగిపోయి నలుగురిని నవ్విస్తూ బతకడం అతని తత్వం. ఆ యూనిఫామ్ వేస్తేనే తనకు గౌరవం, తనకు బువ్వ దొరుకుతుందని ఆయన నమ్మకం.ఎండనక, వాననక రోడ్ల వెంట నడిచే ఈ తుపాకీ రాముడు కథ, వలసలు, పేదరికం, బతుకుదెరువు కోసం మనిషి పడే తపనకు అద్దం పడుతుంది. అధికారులు ఆయనను గుర్తించి, ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా ఆసరా కల్పిస్తే, ఈ నకిలీ తుపాకీ పట్టిన చేతులు నిజమైన భరోసాను పొందుతాయి.

# రైస్ మిల్లుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**-రెండు, మూడు రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే నిబంధనల ప్రకారం ఆస్తులు, బ్యాంకు ఖాతాలు సీజ్ చేయాలి**
**-డిఫాల్టర్ రైస్ మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను గుర్తించాలి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి),అక్టోబర్ 22 :** రైస్ మిల్లుల నుంచి రావాల్సిన బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షే మాట్లాడుతూ, బకాయిలు చెల్లించని డిఫాల్టర్ రైస్ మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను గుర్తించాలని ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లోగా బకాయిలు చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం నిబంధనలకు అనుగుణంగా సంబంధిత రైస్ మిల్లుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేయాలని స్పష్టం చేశారు.అదేవిధంగా, సంబంధిత రైస్ మిల్లర్లు, వారి కుటుంబ సభ్యుల ఆస్తుల లావాదేవీలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బకాయిల వసూళ్ల ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్,జిల్లా జిల్లా మేనేజర్ శ్రీకాంత్,డి.సి. ఓ.శ్రీమాల,ఆర్డీఓ గంగయ్య,సంబంధిత అధికారులు, తదితరులు,పాల్గొన్నారు.

# వైనాలను పరామర్శించిన శీను బాబు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 22 :** కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును మరియు వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు గురువారం పరామర్శించారు. బుధవారం రోజున వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సాంబయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ మూసుకుల సహేందర్ రెడ్డి గాండ్ల మోహన్, రాజు రెబల్, గడప కృష్ణమూర్తి, మల్యాల తిరుపతి, తీగల రాజయ్య గౌడ్, కటకం రవీందర్, కటకం నారాయణ, సయ్యద్ ఇక్బాల్, లల్లు, తదితరులు పాల్గొన్నారు. మరొక కార్యక్రమంలో అలాగే పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, ఏసిపి మడత రమేష్, సీఐ నక్క ప్రసాద్, ఎస్సై కొట్టే ప్రసాద్ తదితరులు సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైనాల రాజుకు మరియు వై నాల వినోద్ కు సానుభూతి వ్యక్తం చేశారు.



## ఏఎంసి చైర్మన్ కు పరామర్శల వెల్లువ



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 22 :** కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా ఆయన కుమారుడు ఏఎంసీ చైర్మన్ వైనల రాజు సోదరుడు వై నా ల వినోద్ లను పెద్దపెల్లి జిల్లా డిసిపి రామ్ రెడ్డి గోదావరిఖని ఏసిపి మడత రమేష్ గోదావరిఖని టూ టౌన్ సిఐ నక్కా ప్రసాద్ కమాన్ పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్ పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ వారిని పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. వారికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి బండ రమేష్ రెడ్డి బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఏఎంసీ డైరెక్టర్ దాసరి గట్టయ్య పెంచికల్పేట ఉప సర్పంచ్ చొప్పరి శేఖర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ మైనార్టీ నాయకులు ఎండి అప్సర్ ఎండి జావిద్ యూసుఫ్ లల్లు జూలపల్లి ఉప సర్పంచ్ సంతోష్ మాదాసు విజయ్ పరామర్శించడం జరిగింది.

## వైనాల రాజును పరామర్శించిన మంథని ఆర్డీఓ



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 22 :** కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును, వారి కుటుంబ సభ్యులను మంథని ఆర్డీఓ సురేష్, కాంగ్రెస్ పార్టీ మంథని మండల అధ్యక్షులు అయిలి ప్రసాద్, మంథని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న లు గురువారం పరామర్శించారు. బుధవారం వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సాంబయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. వారి వెంట కమ్మగోని చౌదరి గౌడ్, పర్శవేన మోహన్ యాదవ్, బొజ్జ సతీష్, సోప్పరి సంతోష్, భూస తిరుపతి, లల్లు తదితరులు పాల్గొన్నారు.